ఉపాధి కూలీలకు కనీస వేతనం వచ్చేలా చర్యలు

- డ్వామా పీడీ రమేష్ ఆదేశం

కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ రమేష్

ప్రజాశక్తి - దుంబ్రిగుడ : ఉపాధి కూలీలకు దినసరి కనీస వేతనం రూ 272 వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అల్లూరి జిల్లా డ్వామా పిడి ఎన్.నరేష్ సూచించారు. మంగళవారం మండలంలో కొర్ర పంచాయతీ బుడమాలపుట్టులో చేపడుతున్న నీటి నిల్వ కందకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ యాప్‌లో రెండు పూటలా పనికి సంబంధించిన ఫోటోలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఉపాధి కూలీలకు కనీస వేతనంతో పాటు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనాల అమలులో

సుప్రీం ఆదేశాలు బేఖాతరు!

గిరిజన సంక్షేమ ముఖ్యకార్యదర్శి జారీచేసిన అడ్డగోలు జిఒపై గిరిజన సంఘం ఆందోళన

కాంతిలాల్ దండే జారీ చేసిన ఉత్తర్వులను చూపిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఎపి గిరిజన గురుకులం హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్లకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి బాలదేవ్, గురుకులం వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పాడి కొండలరావు, బుద్ధు, సుంక్ర డిమాండ్ చేశారు. మంగళవారం అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, పాడేరు ఐటిడిఎ, పార్వతీపురం మన్యం జిల్లా గురుకులం హాస్టల్లో పనిచేస్తున్న 26 మంది వర్కర్లను సుప్రీం కోర్టు ఉత్తర్వులు మేరకు జారీ చేసిన జిఒ నెం 40 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాల్సి ఉన్నప్పటి అమలు చేయకపోవడం దారుణమన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే గురుకులంతో సంబంధం లేదని ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమన్నారు. 2021 జనవరిలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా, .రాష్ట్ర ప్రభుత్వం నేటికీ కనీస వేతనాల ఆదేశాలనుఅమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా తక్షణమే ప్రభుత్వం స్పందించి తగు చర్యలు చేపట్టాలని, లేకుంటే కోర్టు ఉత్తర్వుల ధిక్కారంపై ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

చినుకు పడితే చెరువే..!

- అధ్వానంగా ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రధాన రహదారి
- ఆంధ్రా ఊటీ అరకుకు మచ్చలా రోడ్డు దుస్థితి
- విస్తుపోతున్న సందర్శకులు
- ఆవేదన చెందుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

నీరు నిండిన పెద్దగోతులతో అరకు కాంప్లెక్స్‌కు వెళ్లే ప్రధాన రహదారి

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రం, ఆంధ్రా ఊటీగా ప్రసిద్ధి చెందిన అరకులోయలో ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానస్థితిపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు. నిండా పెద్దపెద్ద గోతులమయమై, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణానికి వాహనచోదకులు ఎక్కడ, ఎంత లోతు గొయ్యి ఉందో తెలియని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతుండగా, పాదచారులకు కాలు తడవకుండా ముందుకు కదిలే దుస్థితి ఉంది. చిన్నపాటి చినుకులు కురిసినా చుట్టుపక్కల నీరంతా ఈ గోతుల్లోకి చేరి ఇబ్బందులకు గురిచేస్తోందని స్థానికులు వాపోతున్నారు.

ఈ మార్గంలోనే కాఫీ మ్యూజియం, ఐటిడిఎ అతిథి గృహం, ఎపి టూరిజం హరిత హిల్స్ రిసార్ట్స్ ఉన్నాయి. అంతేకాక నిత్యం ఐటిడిఎ, జిల్లా అధికారులతోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతనిధులతో పాటు అరుకు సందర్శనకు వచ్చిన మంత్రులు, ఇతర ముఖ్యనేతలు, వివిఐపిలు సైతం ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ రోడ్డు ఇంతలా అధ్వానస్థితికి చేరుకున్నా, చూసిచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు, నేతల తీరుపై స్థానికులు, ప్రజా సంఘాలు మండి పడుతున్నారు. మండల కేంద్రంలోనే ప్రధాన రహదారి ఇలాగా ఉంటే మారుమూల గ్రామాల్లో రహదారుల దుస్థితి ఇంకెంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవాలని మన్యవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అందాల అరకుకు దిష్టిలా ఉన్న అధ్వానరోడ్డుకు మరమ్మతులు చేపట్టడం ద్వారా, అరకు దుస్థితి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు తెలియకుండా చేయాలని కోరుతున్నారు.

మాట్లాడుతున్న వెలుగు ఎపిఎం నాయుడు

సమీకృత వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి-చింతూరు

ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్ (ఐఎఫ్ఎస్), ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్ (ఐఎఫ్‌సి) (సమీకత వ్యవసాయం)పై ఎంఎస్ఎఫ్‌పిఒ డైరెక్టర్లకు, రైతు సంఘం లీడర్లు, సిబ్బందికి మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం నాయుడు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ 5 నుండి 10 వ్యవసాయ, అనుబంధ కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఆర్థికంగా బలోపేత చేయడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. చదలవాడ, కొత్తపల్లి గూడూరు పంచాయతీలు ఒక ఐఎఫ్‌సి క్లస్టర్‌గా ఎంపిక చేసుకొని తీర్మానం చేయటం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం స్వామినాయుడు, ఆర్‌వైఎస్ఎస్ వెంకటేష్, ఎపిఒఎన్, ఆర్‌జిఎస్, విఎఎస్, వెలుగు సిసిలు పాల్గొన్నారు.

పకడ్బందీగా సంక్షేమ పథకాల అమలు

ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి

ప్రజాశక్తి - రంపచోడవరం

వైసిపి ప్రభుత్వం పకడ్బందీగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని ఉట్ల సచివాలయం పరిధిలోని ఉట్ల, రామన్నపాలెం గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఆయా పథకాలు లబ్ధిదారులకు అందాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి, సంక్షేమ పథకాలు అందని వారికి రానున్న రోజుల్లో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, జెడ్పిటిసి, వైస్ ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటీసీలు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

నైపుణ్యాభివృద్ధితో మెండుగా ఉపాధి అవకాశాలు

◆ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: చదువుతోపాటు నైపుణ్య రంగాలలో శిక్షణ పొందితే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడుతూ ఉద్యోగం ఎక్కడ వస్తే అక్కడకు వెళ్లి చేయాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సమయం వృథా చేయకుండా, విజయం సాధించే వరకు సాధన చేయాలన్నారు.యువత అసాంఘిక కార్యక్రమాల వైపు దృష్టి మళ్లిస్తే భవిష్యత్తు ఉండదన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానానికి మెరుగుపరుచుకోవాలని సూచించారు.

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ యువతకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని, భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలన్నారు. తలిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలను చదివిస్తారని, వారి ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. తప్పుడు మార్గంలో పయనించి, తల్లిదండ్రులకు చెడ్డపేరు తీసుకొచ్చి, వారిని మనోవేదనకు గురిచేయవద్దని హితవు పలికారు. సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. విద్యార్థి దశ నుండి ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి సరైన ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన యువతకు నియామక పత్రాలను అందజేసారు. కార్యక్రమంలో జిఎంఆర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత, శిక్షణ,ఉద్యోగ కల్పనాధికారి ఎం. రూపణి, ఎస్‌డిఒ జి. ప్రశాంతకుమార్, కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

డోలీ మోతే శరణ్యం!

హృద్రోగిని డోలిలో ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబీకులు

ప్రజాశక్తి -అనంతగిరి : మారుమూల గిరిజన గ్రామాల్లో కనీస రోడ్డు సౌకర్యాలు లేక అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తరలించేందుకు వారు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కాదు. డోలిమోతతో ఆసుపత్రికి తీసుకెళ్లడం, ఈలోగా అంతా సవ్యంగా సాగితే సరేసరి, లేకుంటే వారి ప్రాణాలు గాల్లోదీపమయ్యే పరిస్థితులు గతంలో ఎన్నో జరిగాయి. తాజాగా మంగళవారం అనంతగిరి మండలం గుమ్మ పంచాయతీ మారుమూల గ్రామమైన కర్రిగోడ గ్రామానికి చెందిన సింబోయిన. శాంతి అనే పందొమ్మిదేళ్ల యువతికి ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో, గత్యంతరం లేని పరిస్థితుల్లో కర్రిగోడ నుంచి కొండ మార్గంలో దాదాపు పది. కిలోమీటర్లు దూరాన ఉన్న గుమ్మ వరకు యువతి కుటుంబసభ్యులు డోలిలో మోసుకొచ్చి, అక్కడ నుంచి అంబులెన్స్ ద్వారా విజయనగరం జిల్లా ఎస్ కోట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ వైద్యసేవలతో యువతిశాంతి ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. కర్రిగుడ గ్రామానికి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ, అటవీశాఖ అభ్యంతరం చెప్పడంతో పనులు జరగకపోవడంతో ఇలా అనునిత్యంతోపాటు అత్యవసర పరిస్థితుల్లోనూ నానా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దుస్థితికి అటవీశాఖను బాధ్యులుగా చేసి, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చింతూరులో సిపిఎం, సిపిఐ

బహిరంగ సభ జయప్రదానికి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 4న చింతూరులో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం ప్రచార బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని లోదొడ్డి గ్రామంలో ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ కొమరాపురం, జడ్డంగి మీదుగా రాజవొమ్మంగి వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మండల నాయకులు కొండ్ల సూరిబాబు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఒకే భాష, ఒకే విద్య, ఒకే మతం అంటూ ప్రజలపై మనువాదం భావజాలాన్ని బలవంతంగా రుద్దుతుందని తెలిపారు. కట్టుకునే బట్ట, తినేతిండిపైనా ఆంక్షలు విధిస్తుందన్నారు. ఆదివాసీ సంప్రదాయాలు, ఆచారావ్యవహారాలను దెబ్బతీసే విధంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. అమాయక ఆదివాసీలను హృదయాల్లో విషాన్ని నింపుతుందన్నారు. మరో వైపు ప్రభుత్వ రంగ సంస్థలను అంబాని, అదాని వంటి కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు పూనుకుంటుందని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా 4న జరిగే భారీ బహిరంగ సభకు వేలాదిగా ప్రజల తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్నాథం, రామరాజు, రాజు, రమేష్, మురళి, సత్యనారాయణ, సింహాద్రి, శీను, శేఖర్, రాంబాబు, పాపారావు, విజయ్, రమణ, ప్రవీణ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

4న వేలాదిగా తరలిరండి : సిపిఎం నేత కిరణ్

గిరిజనులతో మాట్లాడుతున్న సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

చింతూరు : మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ కేంద్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన ప్రచార భేరి ముగింపు సందర్భంగా ఈ నెల 4న చింతూరులో జరుగు భారీ బహిరంగ సభకు వేలాది తరలిరాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఏడుగురాళ్ళపల్లిలో జరిగిన సిపిఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశాన్ని, దేశ సంపదను అమ్మేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. బీజేపీ కార్పొరేట్, మతోన్మాద విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, వాటికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కుంజా సీతారామయ్య, మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు పల్లపు వెంకట్, యర్రంశెట్టి, శ్రీనివాసరావు, మల్లం సుబ్బమ్మ, మడివి దీపక్, మడివి కొసయ్య పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో పోరాటాలు ఉధృతం

సిపిఎం, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- విఆర్.పురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, గిరిజన వ్యతిరేక విధానాలపై మేడే స్ఫూర్తితో పోరాటాలను ఉధృతం చేస్తామని సిపిఎం, సిఐటియు నాయకులు అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా సోమవారం సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఎర్ర జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ ప్రాణాలు ఫణంగా పెట్టి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయని దుయ్యబట్టారు. దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులు పెరిగాయన్నారు. రాష్ట్రంలో కార్మికులకు ఇచ్చిన హామీని జగన్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పంకు సత్తిబాబు, పులి సంతోష్ కుమార్, గూటాల శ్రీను, లక్ష్మణరావు, సోడి మల్లయ్య, షేక్ ఇబ్రహీం, కన్నయ్య, మాదిరెడ్డి, శ్రీను, ఈర్ల నాగేశ్వరరావు, పలు సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

అడ్డతీగల : మండల కేంద్రంలోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం భవనం వద్ద సిఐటియు మండల అధ్యక్షుడు గుల్లల సురేష్ బాబు జెండాను ఎగరవేశారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి బి నిర్మల ఆధ్వర్యంలో స్కీమ్ వర్కర్లు, పలు రంగాల కార్మికులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు డివిజన్ నాయకులు చీకట్ల శామ్యూల్, నక్క పెంటర్, ఆదినారాయణ, పెద్దకాపు అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగలలో మేడే జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సిఐటియు నాయకులు, కార్మికులు

కిముడుపల్లికి తారురోడ్డు నిర్మాణంపై

మన్యవాసుల హర్షం

రోడ్డు నాణ్యతపై సూచనలు చేస్తోన్న గిరిజన మహిళ

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలోని మారుమూల కిముడుపల్లికి ఎట్టకేలకు తారురోడ్డు నిర్మాణం జరుగుతుండడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెదకోడాపల్లి నుంచి కిముడుపల్లి వరకు జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్న స్థానిక గిరిజనులు, ముఖ్యంగా మహిళలు రోడ్డు నిర్మాణాన్ని నాణ్యతతో చేపట్టాలని అక్కడున్న కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ ప్రతినిధులకు సూచిస్తున్నారు. తమ గ్రామానికి రోడ్డు మంజూరుకు కృషి చేసిన పూర్వ ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

మారుమూల కిముడుపల్లి పంచాయతీ కేంద్రానికి మూడుసార్లు పర్యటనకు వచ్చిన అప్పటి పిఒ గోపాలకృష్ణ రాకపోకలకు ప్రజలు పడుతున్న కష్టాలను స్వయంగా పరిశీలించారు. పాడేరు జిల్లా కేంద్రానికిగానీ, పెదబయలు మండల కేంద్రానికి గానీ నిత్యవసర, అత్యవసర పనులకు వెళ్లాలంటే గిరిజనులు పడుతున్న రాకపోకల కష్టాలపై స్పందించిన పిఒ, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. గతంలో ఎంతోమంది అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా స్పందించిన పరిస్థితుల్లో పూర్వ పిఒ గోపాలకృష్ణ చొరవతో నిధులు మంజూరు కావడం, మూడు నెలల్లోనూ పనులు పూర్తికావడంపై మన్యవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాటి పిఒ గోపాలకృష్ణకు రుణపడి ఉంటామని వెల్లడిస్తూ, ధన్యవాదాలు తెలియజేస్తున్నారు .ప్రస్తుత పిఒ అభిషేక్ తమ గ్రామంలోని మిగిలిన సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని గండేరు నిరీక్షణరావు కోరుతున్నారు. రోడ్డు నిర్మాణం మంజూరుకు పిఒకు విన్నవించి, కృషి చేసిన వారిలో కోడా సింహాద్రి, కోడా వరహానందం, చెట్టి వంశీ, సీసాలి సత్యనారాయణ, గిరిజన ఉద్యోగులు ఉన్నారు.

ఆశాలకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి -దుంబ్రిగూడ: మండలంలోని దుంబ్రిగూడ పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలకు ప్రభుత్వం పంపిణీ చేసిన నూతన యూనిఫామ్ చీరలను మంగళవారం స్థానిక వైద్యాధికారి పి.రాంబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ గ్రామస్థాయిలో గిరిజనులకు వైద్యసేవలను అందించడంలో ఆశ కార్యకర్తలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో ఆశ కార్యకర్తలు గ్రామాల్లో మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించడంలో కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో పీహెచ్సీ సిబ్బంది సాంబశివరావు, రామారావు, హెల్త్ అసిస్టెంట్ స్వామి పాల్గొన్నారు.

నాలుగేళ్లగా అందని రైతు భరోసా

లైకాన్‌పూర్ గిరిజన రైతుల ఆవేదన

ప్రజాశక్తి -సీలేరు

అగ్రికల్చర్ ఉద్యోగి పవన్ నిర్లక్ష్యం వల్ల తమకు నాలుగేళ్ల నుండి పిఎం కిసాన్/రైతు భరోసా అందడం లేదని జీకే వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంప్ చంద్రుపల్లి లైకాన్‌పూర్‌కి చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన వంతలు గెన్ను, సీసా లైకాన్ మంగళవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ గ్రామంలో 30 మంది గిరిజన రైతులు ఉన్నట్టు తెలిపారు. పిఎం కిసాన్/రైతు భరోసా నాలుగేళ్ల నుంచి అందకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోయామన్నారు. రైతు భరోసాకు సంబంధించిన పత్రాలు ఇంతకుముందే అగ్రికల్చర్ ఉద్యోగి పవన్‌కి అందజేశామని, తమకు రైతు భరోసా కల్పించాలని అనేకసార్లు గ్రామసభల్లో కార్యదర్శి శ్రీనివాస్‌కు, అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశామని తెలిపారు. కొద్ది రోజుల క్రితం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామని, అయినా ఎవరూ చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. ఈ ఏడాదైనా తమకు రైతు భరోసా అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే అగ్రికల్చర్ ఉద్యోగి పవన్‌పై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ అభిషేక్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

రేషన్ బియ్యం అందని కార్డుదారులు

రేషన్ పక్కదారిపై తహశీల్దార్ ఆరా

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలో కొన్ని రేషన్ డిపోల్లో కార్డుదారులకు ఇవ్వాల్సిన బియ్యం పక్కదారిపై స్థానిక తహశీల్దార్ లక్ష్మి మంగళవారం ఆరా తీశారు. రేషన్ డీలర్ చేతివాటం శీర్షికతో మంగళవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి స్పందించి, మండలంలోని 14మంది రేషన్ డీలర్లను కార్యాలయానికి రప్పించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్డుదారులకు అందాల్సిన రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై క్షేత్రస్థాయిలో ఆయా గ్రామాలను పర్యటించి, విచారణ చేస్తామని, తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

తప్పెవరిదనే విషయమై తర్జనభర్జన

కాగా గంగాడి, బూరివలసలో 14మంది కార్డుదారులకు మార్చినెల రేషన్ బియ్యం అందకపోవడంలో తప్పు ఎవరిదన్న విషయమై ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారింది. పట్టాం పంచాయతీలో వెలుగులోకి వచ్చిన వ్యవహారంపై తప్పు తమది కాదని రేషన్ డీలర్ చెబుతుండడంపై ఈ అక్రమాలకు బాధ్యులెవరో తేల్చి, చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం కార్యదర్శి తాపుల కృష్ణ డిమాండ్ చేశారు. కార్డుదారులకు నేరుగా డీలరు నుంచి కాకుండా, గ్రామాలకు వచ్చే మొబైల్ రేషన్ పంపిణీ యూనిట్ల ద్వారా రేషన్ పంపిణీ జరుగుతున్న నేపథ్యంలో, కార్డుదారుల బియ్యాన్ని ఎవరు కైంకర్యం చేశారో తేల్చాలని గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేస్తున్నారు.

కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో ఉద్యోగ విజయోత్సవం

ప్రజాశక్తి -కంచరపాలెం : కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు 'ఉద్యోగ విజయోత్సవం' మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ప్రత్యేక అతిథిగా 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజనీఈశ్వరరావు హాజరై ముందుగా లవ్ జీవిక లోగోను ప్రారంభించారు. అనంతరం కాలేజీ ప్రిన్సిపాల్ కె.వెంకట రమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మేయర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత ఉద్యోగావకాశాలు సాధించడం గర్వకారణమన్నారు. డిప్లొమా స్థాయిలో ఏకైక కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ గుర్తింపు పొందిన ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో చదివిన విద్యార్థులందరూ అత్యధిక స్థాయిలో జీతాలు పొంది ఉద్యోగాలు సాధించడం మంచి పరిణామం అన్నారు. ఈ కాలేజీ ఒక ఏడాదిలోనే 240 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించేలా కృషి చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణతో పాటు ఇతర అధ్యాపకులను ఆమె ప్రశంసించారు. ఈ కాలేజీలో చదివిన డి.వంశీప్రియాంక ఏషియన్ పెయింట్స్‌లో రూ.6.73 లక్షల వార్షిక జీతంతో ఉద్యోగం సాధించడం గర్వకారణమన్నారు. మరో 54 మంది బాలికలు ఉద్యోగాలు సాధించడం మహిళాసాధికారతకు నిదర్శనమని పేర్కొన్నారు. హెచ్‌పిసిఎల్‌లో 35 మంది ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. కార్పొరేటర్ చల్లా రజని ఈశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలోనే ఉత్తమ కళాశాలగా నిలిచిన కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ తమ వార్డులో ఉండడం గర్వకారణంగా భావిస్తున్నానని చెప్పారు. ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ తమ కాలేజీకి ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డుతోపాటు ప్రిన్సిపాల్ గ్లోబల్ అచీవ్‌మెంట్ అవార్డులు, ఇంటర్నేషనల్ అకడమిక్ లీడర్, గ్లోబల్ ఫ్యాకల్టీ అవార్డు లభించినట్లు చెప్పారు.

అనంతరం ఉద్యోగాలు పొందిన విద్యార్థినీవిద్యార్థులకు నియామక పత్రాలను మేయర్ గొలగాని వారివెంకట కుమారి, కార్పొరేటర్ చల్ల రజనీఈశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఒఆర్ఎం.రావు, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎ.వరహాలు, పూర్వ విద్యార్థి డాక్టర్ బి.దేముడు, యుఎస్.శర్మ, బిఎస్.రామ్మోహన్, కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బివి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు నకిలీ మావోయిస్టుల అరెస్ట్

వివరాలను వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

మరో ఇద్దరు పరారీ

ప్రజాశక్తి- జి. మాడుగుల : మండల పరిధిలో మావోయిస్టులుగా చలామణి అవుతూ, కాంట్రాక్టర్లు, గ్రామపెద్దలను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఐదుగురు వ్యక్తులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిలో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. మీడియా సమావేశంలో పోలీసు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఏడాది మార్చి 20న కోరుకొండ దగ్గరలో ఎర్రగొప్ప వద్ద డబ్బుల కోసం కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేయగా, అతను స్పందించకపోవడంతో జెసిబిని డీజిల్ పరిగిడ్డి వేసి కాల్చివేసిన ఘటనలో నిందితులైన ఐదుగురు నకిలీ మావోయిస్టులు, అలాగా బ్రిడ్జి కాంట్రాక్టర్‌ను బెదిరించి రూ.30లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లువ్వాసింగి, కుడుముసార, తమ్మింగుల సర్పంచుల ద్వారా గతనెల 21న కాంట్రాక్టర్‌ను కొండపైకి పిలిపించి, నెలాఖరులోగా డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తామని, మిషనరీని దగ్ధం చేస్తామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. దీంతో భయపడిన సంబంధిత కాంట్రాక్టర్ గతనెల 30న ప్రాణభయంతో లువ్వాసింగి సర్పంచ్ ద్వారా రూ.ఐదు లక్షలు ఇవ్వజూపగా, వారు నిరాకరించడమే కాక ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తనను చంపేయవచ్చుకాక, మిషన్లను కాల్చేస్తారనే భయంతో సంబంధిత కాంట్రాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదుగురు నకిలీ మావోయిస్టులపై కేసు నమోదు చేసిన పోలీసులు, కాంట్రాక్టర్ సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం జి. మాడుగుల సిఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో అలగం బ్రిడ్జి వద్ద మాటువేసి, ఐదుగురు వ్యక్తుల్లో ముగ్గురిని పట్టుకున్నారు. మిగిలిన ఇద్దరు పరారయ్యారు. పోలీసులకు పట్టుబడిన జి.మాడుగుల మండలం రొయ్యలగెడ్డ గ్రామానికి చెందిన గెమ్మెలి సత్తిబాబు, కిల్లంకోట పంచాయతీ పెదమెట్ట గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు ముజంగి చిన్నారావు, చీడిమెట్ట గ్రామానికి చెందిన డ్రైవర్ కిల్లో ఏడుకలు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. పరారైన ఇద్దరి కోసం ముమ్మర గాలింపు చేస్తున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన నిందితుల నుంచి మూడు మ్యాన్‌ప్యాక్స్, రెండు ఎయిర్ పిస్టల్స్, మూడు ఎలిబిఎల్ తుపాకులు, మూడు మొబైల్ ఫోన్లు, రూ.45వేలు నగదు,మూడు ఆలివ్ గ్రీన్ డ్రెస్సులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

పని ప్రదేశంలో ఏవీ సౌకర్యాలు!

ఎపిఒను ప్రశ్నించిన ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-పెదబయలు రూరల్ : ఉపాధి పని ప్రదేశంలో నీడకు టెంట్లు, ప్రథమ చికిత్స మందులు, ఇతర సౌకర్యాలు లేవని మండలంలోని సీకరి పంచాయతీ బూరుగుపుట్టులో ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. నీడ సౌకర్యం కల్పించని పరిస్థితుల్లో సొంతగా తీసుకెళ్లిన మైకా కవర్ల నీడలో ఉంటూ పని చేసేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారమని వివరించారు. మంగళవారం బూరుగుపుట్టులో నాలుగు గ్రూపులకు చెందిన 120మంది కూలీలు చేస్తున్న భూమి చదును, ట్రెంచింగ్ పనుల పరిశీలనకు వెళ్లిన ఎపిఒ ఎల్ఎన్ మూర్తి వద్ద తమ ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై ఎపిఒ స్పందిస్తూ టెంట్లు, మెడికల్ కిట్లకోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపామని, వచ్చిన వెంటనే ఉపాధి పని ప్రదేశంలో సమకూరుస్తామన్నారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా, తగిన జాగ్రత్తలు తీసుకుని ఉదయాన్నే ఆరు గంటలకే పనికి వెళ్లి, వాతావరణం చల్లగా ఉండేంత వరకు పనులు చేపట్టాలని సూచించారు. సూచించిన కొలత మేరకు పనులను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వీఆర్పి కూడా రాజారావు, కూడా బాలన్న, రామారావు, ఉపాధి మేట్ కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎపిఒ మూర్తి

మోదకొండమ్మ హుండీ లెక్కింపు

హుండీ లెక్కిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - పెదబయలు రూరల్ : మన్య ప్రాంత గిరిజనుల ఆరాధ్య దైవమైన మోదకొండమ్మ తల్లి ఉత్సవాల నేపథ్యంలో భక్తులు అమ్మవారికి హుండీలో సమర్పించిన కానుకలను మంగళవారం ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు గంపరాయి. సూరయ్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు లెక్కించారు. 2022-23 ఏడాదికిగాను భక్తులు కానుకలు, ముడుపుల రూపంలో రూ.34, 890 నగదును అమ్మవారికి సమర్పించారని ఉత్సవ కమిటీ అధ్యక్షులు మజ్జి చంద్రబాబు తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో నిర్వహించనున్న అమ్మవారి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కోశాధికారి రూడ.చిన్నయ్య,మాజీ సర్పంచ్ డడియా రాంబాబు, మోదమాంబ వర్ధక సంఘం అధ్యక్షులు ఎన్. బాబ్జి, చిట్టిబాబు, మాధవరావు, అంజిబాబు, అజయ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి- కంచరపాలెం : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. ఘటనకు సంబంధించి ఎయిర్ పోర్టు పోలీసుల కథనం ప్రకారం... మాధవధార తెన్నేటి నగర్ ప్రాంతానికి చెందిన హనుమంతు మల్లమ్మ (73) ఈ నెల 30వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో జ్యోతి నగర్ మీదుగా నడుచుకుంటూ జాతీయ రహదారిని దాటుతోంది. ఆ సమయంలో ఎన్ఎడి నుంచి తాటిచెట్లపాలెం జాతీయ రహదారి మీదుగా వెళుతున్న కారు డి మార్ట్ ఎదురుగా ఆమెను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రగాయాలైన ఆమెను స్థానికులు సమీప ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం మృతిచెందారు. ఎయిర్ పోర్టు సిఐ బిఎండి ప్రసాద్ నేతృత్వంలో ఎస్ఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ టంకాల సాయి చరణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వరాహ నదిలో జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి -కోటవురట్ల : పందూరు గ్రామం వద్ద వరాహ నదిలో జారిపడి మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం, పందూరు గ్రామానికి సంబంధించి వికలాంగ మహిళ అప్పికొండ నాగరత్నం (54) మంగళవారం నదిలో బట్టలు ఉతికేందుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు జారిపడి నీట మునిగి మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలు దాదాపు 12ఏళ్లుగా భర్త నుంచి దూరంగా ఉంటోందని, ఇటీవల కొడుకు ప్రమాదవశాత్తు మరణించడంతో ఒంటరి మహిళగా గుర్తించామన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పుట్టినరోజు వేడుకల్లో విషాదం

- సముద్రంలో గల్లంతై యువకుడు మృతి

ప్రజాశక్తి -ఎస్. రాయవరం : పుట్టినరోజు వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. స్నేహితుడి జన్మదినాన్ని సముద్ర తీరంలో జరిపేందుకు వెళ్లిన మిత్రబృందంలో ఒకరు సముద్రంలో గల్లంతై దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి. మండలంలోని రేవుపోలవరంసముద్రతీరంలో యువకుడు అలలకు కొట్టుకుపోయి దుర్మరణం పాలయ్యాడు. నర్సీపట్నం దని గురంధాలపాలెం గ్రామానికి చెందిన కొళ్ళన జగదీష్ (18) అనే యువకుడు తన స్నేహితుడు పుట్టినరోజు వేడుకల్లో భాగంగా నలుగురు స్నేహితులతో కలిసి సముద్రతీరం ఒడ్డున కేక్ కటింగ్‌కు వెళ్లాడు, కేక్ కట్ చేసిన తర్వాత సముద్ర స్నానాలకు దిగిన యువకుల్లో జగదీష్ అలల తాకిడికి కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, గాలింపులు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని నక్కపల్లి ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ప్రసాదరావు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక సంబరాలు

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ ప్రాంతంలోని 7వ వార్డు పరిధి ద్రోణంరాజు కల్యాణ మండపంలో మేడే వారోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్మికులు, వారి పిల్లలు వివిధ కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అభ్యుదయ గీతాలు ఆలపించడంతో పాటు, కార్మిక, అభ్యుదయ, జానపద గీతాలకు చేసిన నృత్యాలు వీక్షకులను ఎంతగానో అలరించాయి. వంటగ్యాస్ ధరలు పెంపుదల, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణపై స్కిట్లు, చిన్నచిన్న నాటికలు వేసి ఆకట్టుకున్నారు. ఈ ప్రదర్శనలు మల్లయ్యపాలెం, పరదేశిపాలెం, కొమ్మాది ఎస్‌సి కాలనీ నుంచి వచ్చిన కళా కారులు ప్రదర్శించారు. వీరికి బి.పుణ్యవతి, డి.ఉమాశైలజ, కె.తేజు శిక్షణ ఇచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజులు కళా ప్రదర్శనలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్న బాలలను, కార్మికులను అభినందించారు. మన దేశంలోనూ, రాష్ట్రంలోనూ కార్మిక వర్గంపై తీవ్రమైన దాడి జరుగుతోందన్నారు. కార్మికులు ఎన్నో త్యాగాలు చేసి, ప్రాణాలర్పించి 8 గంటల పని దినం సాధిస్తే నేటి బిజెపి పాలకులు కార్మికులతో 12 గంటలు పని చేయించుకోవచ్చని చెపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కులను కాపాడుకునేందుకు రానున్న రోజుల్లో మే డే స్ఫూర్తితో కార్మికులు, ప్రజలు ఉద్యమాల బాట పట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రాజుకుమార్, డి.కొండమ్మ, ఇతర సంఘాల నాయకులు జి.కిరణ్, ఎస్.రామప్పడు, సిహెచ్.శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై సిఎం స్పష్టమైన ప్రకటన చేయాలి

ప్రజాశక్తి - అనకాపల్లి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బుధవారం విశాఖ పర్యటనకు వస్తున్న సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పష్టమైన ప్రకటన చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎలాగైనా ప్రైవేటీకరించి తీరుతామని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెగేసి చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని తెలిపారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కును రక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు నేటికీ 809 రోజులుగా ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే సహించేదిలేదని దీక్షలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అధికార పార్టీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నాయకులు వైవి.సుబ్బారెడ్డి తదితరులు కూడా దీక్షలకు మద్దతు తెలియజేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని చేతులు దులుపుకొని వదిలివేయడం అంటే రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజలకు అన్యాయం చేయడమే అవుతుందని లోకనాథం పేర్కొన్నారు. మధురవాడ హిల్ నెంబర్ 4పై అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తే వేల ఉద్యోగాలు వస్తాయన్న మాట అటుంచితే ఇప్పటికే ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సుమారు లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురాకపోవడంపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు ఇవ్వకుండా, ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా ద్రోహం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై అఖిల పక్షాలను కలుపుకొని పోరాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ముందు మోకరిల్లడం సరైనదికాదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే అఖిలపక్ష పార్టీలను, సంఘాలను కలుపుకొని దేశ ప్రధానితో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ పర్యటనలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అందరినీ కలుపుకొని ఉద్యమిస్తామని తెలియజేయాలన్నారు.

ఉక్కు రక్షణకు నేడు రాస్తారోకోలు

- జయప్రదం చేయాలని వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం బుధవారం జరుగనున్న రాస్తారోకోలను ఎక్కడికక్కడ జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు ప్రజలకు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజులు మంగళవారం సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రెండేళ్లకు పైబడి ఉద్యమం జరుగుతున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన కుట్రలను ఆపలేదని తెలిపారు. ఏదో విధంగా ప్లాంటును బలహీనపరిచి తన అనుయాయులైన కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ జరిగే రాస్తాకోలను జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ), ఎంసిపిఐ, ఎస్‌యుసిఐ తదితర వామపక్ష పార్టీలు కూడా బంద్‌లో పాల్గొంటున్నాయని తెలిపారు.

ఉక్కునగరం : బుధవారం జరిగే రాస్తారోకోలను జయప్రదం చేయాలని విశాక ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోటేశ్వరరావు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 810వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్ 1 కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడారు. ఎఐటియుసి నాయకులు కె.రాజబాబు, డివి.నాగబాబు, వెంకటేష్, సిఐటియు నాయకులు బి.అప్పారావు, ఐఎన్‌టియుసి నాయకులు జివి.సుబ్బయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్ : ఉక్కు రక్షణ కోసం తలపెట్టిన రాస్తారోకోలను ప్రజలు జయప్రదం చేయాలని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు పిలుపునిచ్చారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన ఉక్కు దీక్షలు మంగళవారానికి 761వ రోజుకు చేరాయి. శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దీక్షల్లో సంఘం జగదాంబ జోన్ నాయకులు కెవిపి.చంద్రమౌళి, కె.నర్సింగరావు, కె.సంతోష్ కుమార్, సిహెచ్.రామారావు కూర్చున్నారు.

ఉత్తరాంధ్రను ఉత్తమాంధ్రగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్రను తమ ప్రభుత్వ హయాంలో ఉత్తమాంధ్రగా తీర్చుదిద్దుతున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక సర్క్యూట్ హౌస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామాయపట్నం పోర్టుకు, భోగాపురం ఎయిర్ పోర్టుకు తానే శంకుస్థాపన చేశానని డబ్బాలు కొట్టుకుంటున్న చంద్రబాబు ఇకనైనా అసత్యాలు మానుకోవాలని హితవు పలికారు.

నిలకడలేని ఆదాయం

జమకాని 15వ ఆర్థిక సంఘం నిధులు
తలసరి గ్రాంట్‌లో హెచ్చుతగ్గులు
సర్‌ఛార్జ్ డబ్బులూ అంతే..
నిధుల్లేక ఆచితూచి జెడ్‌పి అడుగులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రిజిస్ట్రేషన్లు తగ్గడంతో జిల్లా పరిషత్ ఆదాయంపై ఆ ప్రభావం పడింది. ప్రభుత్వం నుంచి నిధులు సరిగా రాకపోవడంతో అభివృద్ధి పనులు, రక్షిత మంచినీటి పథకాల నిర్వహణకు నిధులు వెచ్చించలేని పరిస్థితి నెలకొంది. జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం ఇచ్చే తలసరి గ్రాంట్, సీనరేజ్ పన్ను కింద రావాల్సిన ఆదాయం, స్టాంప్‌డ్యూటీపై వచ్చే సర్‌ఛార్జ్, జెడ్‌పి షాపుల అద్దె ద్వారా వచ్చే ఆదాయంలో స్థిరత్వం కరువైంది. ఇవే జెడ్‌పికి ప్రధాన ఆదాయ వనరులు. వీటి ద్వారా వచ్చే ఆదాయం తగ్గడంతో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించలేని పరిస్థితి నెలకొంది.

జిల్లా పరిషత్‌కు తలసరి గ్రాంట్ కింద 2014-15లో రూ.57,59,400 జమకాగా, 2015-16, 2016-17, 2017-18లో రూ.83,52,400 చొప్పున వచ్చాయి. 2018-19, 2019-20లో రూ.78,25,200, 2020-2021, 2022-23లో రూ.92,15,500 చొప్పున నిధులొచ్చాయి. 2021-22లో రూ.69,11,640 జమయ్యాయి. ఈ సంవత్సరంలో జిల్లా పరిషత్‌కు రూ.23 లక్షల ఆదాయం తగ్గింది. 2014-15 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో అత్యధికంగా గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.6.67 కోట్ల ఆదాయం సీనరేజ్ కింద వచ్చింది.

సర్‌ఛార్జ్ కింద 2022-23లో రూ.6.48 లక్షల ఆదాయం వచ్చింది. 2020-21లో రూ.7.09 కోట్లు, 2021-22లో రూ.7.73 కోట్లు సర్‌ఛార్జ్ కింద జమైంది. గడచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన రిజిస్ట్రేషన్లు ముందుటేడాది లేకపోవడంతో స్టాంప్ డ్యూటీ కింద రావాల్సిన సర్‌ఛార్జ్ పెరగలేదు. 2018-19లో సర్‌ఛార్జ్ కింద నిధులు జమకాలేదు. రిజిస్ట్రేషన్లలో పెరుగదల లేకపోవడంతో జిల్లా పరిషత్‌కు రావాల్సిన ఆదాయం కోటి రూపాయలకుపైగా తగ్గింది.

జమకాని 15వ ఆర్థిక సంఘం నిధులు

15వ ఆర్థిక సంఘం నిధులు 2022-23లో పైసా కూడా జమకాలేదు. 2021-22లో రూ.10.49 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం 2022-23లో నిధులు ఇవ్వలేదు. వివిధ పద్దుల కింద వచ్చిన సాధారణ నిధులను అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తున్నామని జిల్లా పరిషత్ అధికారులు చెబుతున్నారు. జిల్లా పరిషత్ సాధారణ నిధులు పుష్కలంగా లేకపోవడంతో జెడ్‌పిటిసి సభ్యుల ప్రతిపాదిత పనులకు, రక్షిత మంచినీటి పథకాల నిర్వహణకు డబ్బులు విడుదల విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సి వస్తోంది.

2014-15 నుంచి 2022-23 వరకు జెడ్‌పికి జమైన నిధుల వివరాలు

సంవత్సరం	తలసరి గ్రాంట్ (లక్షల్లో)	సీనరేజ్	సర్‌ఛార్జ్ (లక్షల్లో)
2014-15	రూ.57.59	రూ.57.66 లక్షలు	రూ.3.44
2015-16	రూ.83.52	రూ.1.39 కోట్లు	రూ.5.25
2016-17	రూ.83.52	రూ.1.04 కోట్లు	రూ.5.09
2017-18	రూ.83.52	రూ.1.05 కోట్లు	రూ.4.32
2018-19	రూ.78.25	రూ.1.30 కోట్లు	-
2019-20	రూ.78.24	రూ.1.30 కోట్లు	రూ.5.44
2020-21	రూ.92.15	రూ.1.38 కోట్లు	రూ.7.09
2021-22	రూ.69.11	రూ.3.00 కోట్లు	రూ.7.73

నేడు విశాఖకు సిఎం రాక

అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ, మధురవాడ

రాష్ట్ర ప్రభుత్వం మధురవాడ ఐటి హిల్ నెంబర్ 4లో 130 ఎకరాలను అదానీ డేటా సెంటర్‌కు కేటాయించిన నేపథ్యంలో శంకుస్థాపన నిమిత్తం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బుధవారం విశాఖకు రానున్నారు. మధ్యాహ్నం నేరుగా ఆయన హిల్‌పై ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. బుధవారమంతా సిఎం విజయనగరం, విశాఖపట్నంల్లో బిజీబిజీగా గడపనున్నారు. తొలుత ఆయన విజయనగరం జిల్లాలోని భోగాపురం ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం హిల్ నెంబర్ 4కు విచ్చేస్తారు. ఇక్కడ జరిగే డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో గౌతమ్ అదానీ పాల్గొంటారని సమాచారం. మరోవైపు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ, ప్రజా సంఘాలూ బుధవారం జరిగే రాస్తారోకోల్లో పాల్గొననుండటంతో రాజకీయంగానూ సిఎం విశాఖ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న హై టెన్షన్ నెలకొంది. ఈ క్రమంలో పోలీస్, ఇంటెలిజెన్స్ వర్గాలు, అధికార యంత్రాంగం అప్రమత్తమై పరిస్థితులపై నివేదికలు తెప్పించుకున్నాయి. విశాఖలో 1300 మందితో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లును పరిశీలిస్తున్న మంత్రి రజని

ఏర్పాట్లు పరిశీలన

సిఎం పర్యటన ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని పరిశీలించారు. ఆమె వెంట టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, పార్లమెంటు సభ్యులు ఎంవివి.సత్యనారాయణ, ఐటి శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉన్నారు.

అదానీకి లాభం చేకూర్చేందుకే ఐలా ఏర్పాటు

- సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నిబంధనలన్నింటినీ బుల్డోజ్ చేసి అదానీకి భారీగా లాభాలను పోగేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆఘమేఘాల మీద ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా)ను ఏర్పాటు చేసిందని సిపిఎం ఫ్లోర్ లీడర్, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ చర్య పూర్తిగా చట్ట విరుద్ధమన్నారు. దీనివల్ల మహా విశాఖ నగరపాలక సంస్థ వివిధ పన్నులు, ఛార్జీలు, రుసుముల ద్వారా అదానీ స్థాపించబోయే సంస్థల నుంచి వచ్చే ఆదాయాన్ని భారీగా కోల్పోనుందన్నారు. అడ్డగోలుగా అదానీకి రాష్ట్ర ప్రభుత్వం దోచిపెట్టే చర్యలను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. విశాఖలోని రుషికొండ దగ్గరలో ఐటి హిల్ నెంబర్ 4లో రాష్ట్ర ప్రభుత్వం అదానీకి డేటా సెంటర్, 200 మెగావాట్స్ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం పేర సుమారు 130 ఎకరాలు కేటాయించిందని, దాదాపు 4 వేల కోట్ల విలువ కలిగిన భూమిని కేవలం రూ.130 కోట్లకే ధారాదత్తం చేయడం దారుణమని పేర్కొన్నారు. అదానీ డేటా సెంటర్‌కు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం శంకుస్థాపన చేయనున్న విషయాన్ని గుర్తు చేశారు. అదానీకి అన్ని విధాలుగా మేలు చేయడానికి జివిఎంసికి తీవ్రనష్టం చేస్తున్నారని గంగారావు తెలిపారు. అదానీ సంస్థకు ప్రత్యేకంగా ఐలా ఏర్పాటు వల్ల జివిఎంసి భారీగా ఆస్తి పన్ను కోల్పోతుందన్నారు. భవనాల నిర్మాణాల ద్వారా వచ్చే బిల్డింగ్ ఛార్జీలు, ఖాళీస్థలాల పన్ను, ట్రేడ్ లైసెన్స్, గ్రంథాలయ సెస్సు, డెవలప్‌మెంట్ చార్జీలు, బెటర్‌మెంట్, ఇంపాక్ట్ ఫీజులు, అడ్వర్టైజ్‌మెంట్ పన్ను, ప్రొఫెషనల్ ట్యాక్స్ తదితర రుసుముల రూపంలో కోట్లాది రూపాయాలను జివిఎంసి నష్టపోతుందని తెలిపారు. ఇప్పటికే 130 ఎకరాలకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అదానీకి భూబదాలయింపు చేయడంతో జివిఎంసికి సుమారు రూ.5 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. జివిఎంసి మీద రాష్ట్ర ముఖ్యమంత్రి ఒత్తిడి తీసుకొచ్చి ఏప్రిల్ 28న జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఐలా ఏర్పాటుకు ఆమోదం పొందారని అన్నారు. చర్చకు అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా టేబుల్ అజెండా పేర ఈ నియంతృత్వ చర్యకు పాల్పడ్డారని విమర్శించారు.

ఐలా నిబంధనలకు విరుద్ధంగా బైలాను ఏర్పాటు చేశారన్నారు. ఒకవేళ గ్రేడ్ -3 ఐలా ఏర్పాటు చేయాలన్నా 500 ఎకరాల్లో 500 పారిశ్రామిక యూనిట్లు నిర్మాణమై ఉండాలన్నారు. ఇప్పుడు కేవలం 276 ఎకరాల్లో ఐటి హిల్-4 మీద ఐలా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు అదానీకి మాత్రమే భూమి కేటాయించారని తెలిపారు. ఐలాను కేవలం అదానీ డిమాండ్ మేరకే రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇప్పటికే ఐటి హిల్ 1, 2, 3లలో ఉన్న పరిశ్రమలకు అవసరం రాని ఐలా కేవలం ఐటి హిల్-4కే ఏం అవసరం వచ్చిందో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే పెందుర్తిలో ఉన్న ఆటోనగర్, కంచరపాలెంలో ఉన్న ఇండస్ట్రియల్ ఎస్టేట్లకు ఏర్పాటు చేయని ఐలా సంస్థలు అదానీ కంపెనీకే ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. మరోపక్క అదానీ కోసం కేటాయించిన భూమిని మాస్టర్ ప్లాన్-2041లో మిక్స్‌డ్ యూజ్డ్ జోన్-2గా మార్చేశారని, దీని ప్రకారం ఆ భూమిలో స్టార్ హోటళ్లు, రెస్టారెంట్లు, మెట్రో షాపింగ్ మాల్స్, ఐమాక్స్ థియేటర్లు, కమర్షియల్ బిల్డింగ్‌లు, సంపన్నుల నివాసాలకు ఎత్తైన నివాస భవనాలు తదితరమైనవన్నీ నిర్మించుకునే అవకాశం కల్పించారని తెలిపారు. దీనివెనుక రాష్ట్ర ప్రభుత్వ కుట్ర, అవినీతికర చర్యలు ఉన్నాయని స్పష్టమవుతోందన్నారు.

క్లాప్ డ్రైవర్ల సమస్యలపై త్వరలో సమ్మె

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసిలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు రూ.18500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ త్వరలోనే సమ్మెకు వెళ్లనున్నట్లు జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లేబర్ కమిషనర్ ఆదేశాల మేరకు వివక్షత లేకుండా జిఒ 7 ప్రకారం రూ.18500 వేతనం చెల్లించకుండా జివిఎంసి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కేవలం రూ.12500 మాత్రమే చెల్లించడం సరికాదన్నారు. మధ్యవర్తులు, కాంట్రాక్టర్ల దోపిడీ లేకుండా ఆప్కాస్‌ను తీసుకువస్తూ జిఒ 136ను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. దీని ప్రకారం ఆప్కాస్‌లో పనిచేస్తున్న డ్రైవర్లకు రూ.18,500 జీతం చెల్లిస్తున్నారని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్న ఆప్కాస్ డ్రైవర్లు చేస్తున్న పనినే క్లాప్ డ్రైవర్లు కూడా చేస్తున్నారని తెలిపారు. ఒకే సంస్థలు ఒకే పనిని ఒకే విధంగా చేస్తున్నప్పుడు ఆప్కాస్ డ్రైవర్లకు ఒక విధంగా, క్లాప్ డ్రైవర్లకు మరో విధంగా వేతనాలు చెల్లించడం వివక్షత కాదా ? అని ప్రశ్నించారు. అంతేకాకుండా ఎక్కడా లేనివిధంగా జివిఎంసిలో క్లాప్ డ్రైవర్ల పనిని కాంట్రాక్టుకు ఇచ్చారని చెప్పారు. ఆ కాంట్రాక్టర్ ముఖ్యమంత్రి జగన్‌కు బంధువు కావడంతో జిఒను సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. వేతనాలు తగ్గించి ఇస్తున్నారని మండిపడ్డారు.